www.freegurukul.org
(Values, Skill Based Education In Digital)



-సునీల్ ధవళ
స్టాక్ మార్కెట్ నిపుణులు
ఫార్మర్ చీఫ్ ఫైనాన్షియల్ ఆఫీసర్,
అనిల్ ధీరుబాయి
అంబానీ రిలయన్స్ గ్రూప్

# షేర్ కార్నర్

## స్టాక్ మార్కెట్ ప్రశ్నలు - జవాబులు

**సూయిచ్ ఇండస్ట్రీస్ లిమిటెడ్ ఐపీఓ నేడు ప్రారంభమైంది. షేర్లకు దరఖాస్తు చేసుకొంటే లాభదాయకంగా ఉంటుందా?**

**ఎస్. శ్రీకాంత్, హైదరాబాద్**

సూయిచ్ ఇండస్ట్రీస్ లిమిటెడ్ ఐపీఓ(ప్రాథమిక ప్రజా సమర్పణ ద్వారా ఈక్విటీ షేర్ల జారీ) మే 30, 2019 నుంచి జూన్ 04, 2019 వరకు కొనసాగుతుంది. ఒక్కో ఈక్విటీ షేర్ ముఖ విలువ రూ. 10/ ఉన్న ఈ ఇష్యూ లో ప్రీమియం తో కలిపి ఒక్కో షేర్ ధర రూ.73/ నుంచి రూ. 75 మధ్య నిర్ణయిస్తారు. కనీసం 1600 (ఒక లాట్) షేర్లకు దరఖాస్తు చేసుకోవాలి. అనగా రూ. 1,20,000/ కనిష్ట పెట్టుబడి ఉండాలి. షేర్లు జూన్ 13 న బొంబాయి స్టాక్ ఎక్స్చేంజి లో నమోదు (లిస్టింగ్) అవుతాయి. ఢిల్లీ కి చెందిన సూయిచ్ ఇండస్ట్రీస్ లిమిటెడ్ 2008 లో ఢిల్లీ ఫోన్ అండ్ బ్యాటరీస్ ప్రైవేట్ లిమిటెడ్‌గా స్థాపించబడి కొన్నేళ్ళకి సూయిచ్ ఇండస్ట్రీస్ గా పేరు మార్చేరు. చైనా నుండి ఎలక్ట్రానిక్ విడి భాగాలను దిగుమతి చేసుకొని మొబైల్ ఫోన్ల బ్యాటరీలు, మొబైల్ ఉపకరణాలు, ఫోన్ బ్యాటరీ పవర్ బ్యాంకులు, లైట్ ఎమిటింగ్ డయోడ్ (ఎల్ఈడి) టెలివిజన్ సెట్లను ఈ సంస్థ తయారీ చేస్తోంది. సూయిచ్ ఇండస్ట్రీస్ యొక్క ఉత్పత్తులు ఉత్తర భారతదేశంలోని గ్రామీణ ప్రాంతాలు, పట్టణాలలో మాత్రమే విక్రయిస్తోంది. కంపెనీ పనితీరు, ఆర్థిక పరిస్థితి, యాజామాన్యంకున్న ప్రతిష్ట పరపతి విషయంలో చెప్పుకోవాల్సిన లోటుపాట్లు లేవు. గత ఐదేళ్లుగా కంపెనీ ఓ మోస్తరు లాభాలను పొందింది. అయితే ఈ రంగంలో పోటీ ఎక్కువ, స్థిరత్వం తక్కువ. లిస్టింగ్ నాడు ఈ షేర్ పై లాభాలు పొందాలనేవారు లేక దీర్ఘకాలం కోసం షేర్లు అట్టిపెట్టుకొనేవారు అధికంగా ఐపీఓ కు దరఖాస్తు చేసుకొంటారు. ప్రస్తుత పరిస్థితుల్లో ఈ ఐపీఓ కన్నా భవిష్యత్లో రాబోయే ఇతర కంపెనీల ఐపీఓ కోసం రూ. 1,20,000 వేలు ఉంచుకోవడం మంచిది లేదా ఇప్పటికే అధిక రాబడి ఇస్తున్న ప్రముఖ కంపెనీల షేర్లు కొనడం ఉత్తమం.

**నేను కొత్తగా ఉద్యోగంలో చేరాను. నెలకి రూ. 15,000 చొప్పున మ్యూచువల్ ఫండ్లలో ఆదా చేసి మూడు నాలుగేళ్లు తర్వాత కారు కొందామనుకొం టున్నాను. ఏ మ్యూచువల్ ఫండ్లలో ఇన్వెస్ట్ చేయమంటారు?**

**ఎమ్. సాయి రోహిత్, హైదరాబాద్**

మ్యూచువల్ ఫండ్లలో పెట్టుబడి కోసం ఇన్వెస్టర్ లక్ష్యం, ఆదా చేయగల మొత్తం, అదా చేయగల సమయం, ఆదా చేయడానికి ఉద్దేశ్యంతో పాటు సరైన మ్యూచువల్ ఫండ్‌ను నిర్ణయించడంలో ఇన్వెస్టర్ యొక్క వయస్సు చాలా ముఖ్యం. కొత్తగా ఉద్యోగంలో చేరారు కాబట్టి మీ వయస్సు 25 అనుకొందాం. మీకు సంపాదించే శక్తితోపాటు రిస్క్ తీసుకొనే సామర్థ్యం ఎక్కువ ఉంటుంది. కాబట్టి 75 శాతం ఈక్విటీ 25 శాతం డెట్ మ్యూచువల్ ఫండ్లలో పెట్టుబడి పెట్టొచ్చు. కాబట్టి లార్జ్ క్యాప్ ఫండ్, మిడ్ క్యాప్ ఫండ్ లలో చెరో రూ 5000, డెట్ ఇన్కమ్ ఫండ్, బ్యాలన్స్డ్ ఫండ్లలో చెరో రూ. 2500/ ఆదా చేయండి. ప్రతీ నెలా వివిధ ఫండ్లలో వేర్వేరుగా ఆదా చేసేబదులు ఒకేసారి ఎస్ఐపీలో నమోదు చేసుకొంటే ప్రతీ నెలా వాయిదాలు నేరుగా మీ బ్యాంక్ నుంచి పైకం తీసుకొని మ్యూచువల్ ఫండ్ యూనిట్లు మీ ఖాతాలో చేరుతాయి. గత రెండు సంవత్సరాలుగా స్థిరమైన ట్రాక్ రికార్డు కలిగి, లాభాలలో వ ద్ధిని పొంది అగ్రస్థానంలో నిలిచిన మ్యూచువల్ ఫండ్లనే ఎంచుకోవాలి.

**మా అమ్మాయి ఎంబీఏ చదువు కోసం 2017 లో నా పేరుమీద రూ. 4 లక్షల విద్యా రుణం తీసుకున్నాను. నెల వాయిదాలు కడుతున్నాను. మా అమ్మాయి ఉద్యోగంలో చేరింది. తను వాయిదాలు కడితే విద్యా రుణం మీద బ్యాంకు కు కట్టే వడ్డీ పై ఆదాయం పన్ను మినహాయింపును పొందడం అవ్వదంటున్నారు. వేరే మార్గమేమైనా ఉందా?**

**కే గోపాలకృష్ణ, నంద్యాల**

ఓ వ్యక్తి తన కొరకు లేదా తన జీవిత భాగస్వామి, పిల్లల ఉన్నత విద్య, విదేశీ విద్య కయ్యే ఖర్చు కోసం బ్యాంకు, గుర్తింపు పొందిన స్వచ్ఛంద సంస్థలు నుంచి ఎడ్యుకేషన్ లోన్ (విద్యా రుణం) తీసుకోవచ్చును. విద్యా రుణం ఎవరి పేరుమీద తీసుకొన్నారో వారికే రుణం తిరిగి చెల్లించే బాధ్యత ఉంటుంది. ఎడ్యుకేషన్ లోన్ పై కట్టే వడ్డీ పై ఆదాయపు పన్ను చట్టం సెక్షన్ 80ఈ క్రింద మినహాయింపు వర్తిస్తుంది. అయితే మీ పేరు మీద ఎడ్యుకేషన్ లోన్ తీసుకొన్నారు కనుక మీరే సెక్షన్ 80ఈ క్రింద మినహాయింపు పొందగలరు. మీ అమ్మాయి సెక్షన్ 80ఈ క్రింద ఆదాయపు పన్ను మినహాయింపు పొందలేదు. ఒక వేల మీరు ఆదాయపు పన్ను పరిధిలోకి రాకపోతే మినహాయింపు సౌకర్యం వదులుకోవాల్సిందే. విద్యా రుణం గడువు వరకు ఆగకుండా మీ అమ్మాయి సంపాదనతో మిగిలిన రుణం త్వరితంగా తీర్చడమే పరిష్కారం.

**సాధారణంగా వేసవిలో పానీయాల ఉత్పాదక సంస్థల లాభాలు వృద్ధి చెందుతాయి కదా. మన్ పసంద్ బేవరేజెస్ షేర్లు ఎందుకు తగ్గుముఖం పట్టాయి. ఆ కంపెనీ షేర్లు ఇప్పుడు కొనవచ్చునా?**

**ఎం. సత్తిరాజు, నర్సాపూర్**

వడోదరకు చెందిన మన్ పసంద్ బేవరేజెస్ సంస్థ 1998 నుంచి మాంగో సిప్, ఫ్రూట్సప్, అప్రిల్లా, మన్ పసంద్ ఓఆర్ఎస్ వంటి బ్రాండ్ల పేరుమీద పానీయాలు ఉత్పత్తి చేస్తూ ప్రజాదరణ పొందింది. కానీ కార్పొరేట్ పాలన విషయంలో కంపెనీ యాజమాన్యం పై అనేక ఆరోపణలు వస్తున్న నేపథ్యంలో ఆ సంస్థ షేర్ ధర అనూహ్యంగా తగ్గింది. గత వారం సంస్థ యొక్క వివిధ ప్రాంగణాల్లో సెంట్రల్ జీఎస్టీ మరియు కస్టమ్స్ కమిషనర్ తనిఖీల్లో పన్ను చెల్లింపుకి సంబంధించి అక్రమాలు వెలుగుచూడడం వలన యాజమాన్యాన్ని నిర్బంధంలోకి తీసుకొన్నారు. ఈ పరిణామాల ద ష్ట్యా కంపెనీ యొక్క అనేక డైరెక్టర్లు రాజీనామా చేశారు, బోర్డు మీటింగ్ కూడా రద్దు చేయబడింది. గత ఏడాది సంస్థ లో అవకతవకలు చోటుచేసుకొంటున్నాయని, ముఖ్యమైన సమాచారాన్ని నిర్వాహకులు దాచిపెడుతు న్నారని భావించి మన్ పసంద్ బేవరేజెస్ యొక్క ఆడిటర్లు తప్పుకున్నారు. అందుచేతనే గత ఏడాది రూ. 250 ఉన్న మన్ పసంద్ బేవరేజెస్ షేర్ ధర నేడు రూ. 50/ కి పడిపోయింది. నకిలీ లావాదేవీలు ఖాతాలు సృష్టించి రూ. 40 కోట్ల వరకు జీఎస్టీ పన్ను ఎగవేసింది అనే ఆరోపణ వచ్చిన గత వారంలోనే షేర్ ధర దాదాపు రూ. 60/ కోల్పోయింది. ఈ పరిస్థితిల్లో మన్ పసంద్ బేవరేజెస్ షేర్లు కొనడం శ్రేయస్కరం కాదు.

**పాఠకులు తమ ప్రశ్నలను**
**Prabhamoney2019@gmail.com**
**కు పంపవచ్చు**

Disclaimer: we collected these articles from Internet part of Social Awareness Campaign, we are thankful to the creators.
We use for non-profit, free education purpose only. To know more, please visit: www.freegurukul.org